మోసం చేయడమే బాబు ష్యూరిటీ

- టెక్కలిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' విస్తృతస్థాయి సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు
- సమావేశానికి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- చంద్రబాబు మోసాలపై ప్రజలకు చైతన్యం కల్పించాలని నాయకుల పిలుపు



'బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ' క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నాయకులు తమ్మినేని సీతారాం, కుంభా రవిబాబు, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, పేరాడ తిలక్, దుంపల లక్ష్మణరావు తదితరులు



వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నాయకులు

టెక్కలి:

ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు అన్నారు. ప్రతీ ఎన్నికల ముందు ప్రజలకు సాధ్యం కాని హామీలతో ష్యూరిటీ ఇచ్చి.. అధికారం దక్కించుకున్న తరువాత గ్యారెంటీగా మోసం చేయడం అలవాటేనన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో 143 వాగ్దానాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా అన్నివర్గాలకు చేసిన మోసాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు పిలుపునిచ్చారు. టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరై కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలనపై పోరాటానికి మరింత ఉత్తేజాన్నిచ్చారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల పార్టీ అనుబంధ విభాగాల్లో నియామకమైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే కూటమి ప్రభుత్వ మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యఅతిథులు కృష్ణదాస్, సీతారాం, రవిబాబు, అప్పలరాజు, రామారావు తదితరులను సన్మానించారు. సమావేశంలో పార్టీ కాళింగ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, పాల వసంతరెడ్డి, పేరాడ భార్గవి, దుబ్బ వెంకట్రావు, ఎంపీపీలు ఆట్ల సరోజనమ్మ, నడుపూరు శ్రీరామ్మూర్తి, పార్టీ మండల కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వరారావు, ఎస్.హేమసుందర్‌రాజు, బి.మోహన్‌రెడ్డి, టి.ఫాల్గుణరావు, నాయకులు వై.చక్రవర్తి, సత్తారు సత్యం, ఎ.రామారావు, టి.కిరణ్, కె.గోవింద్, ఎస్.రామిరెడ్డి, ఎం.అశోక్‌చక్రవర్తి, చుక్క గున్నమ్మ, చిన్ని జోగారావు, ఆర్.మల్లయ్య, వై.మన్మథరావు, ఎస్.ఉషారాణి, జి.గురునాథ్, ఎ.విష్ణు, కె.జీవన్, వి.శ్రీధర్‌రెడ్డి, కె.అజయ్, ఎన్.సత్యరాజ్, పి.వెంకట్రావు, చింతాడ వరుణ్, బి.మధు, జె.జయరాం, ఎ.లక్ష్మీపతి, డి.రామకృష్ణారెడ్డి, సింగుపురం మోహనరావు, పి.రమణబాబు, బి.రాజేష్, ఎన్.భీమారావు, కె.నారాయణమూర్తి, మదీన్, డి.నీలకంఠం, బి.కార్తీక్, ఆర్.లక్ష్మీకాంతం, పి.ఆశారాణి పాల్గొన్నారు.

మోసకారి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి



సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న తరువాత మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని తరిమి తరిమి కొట్టాలి. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి..అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా విస్మరించడం చంద్రబాబుకు అలవాటే. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాలకు ఇంటి దగ్గరకే సంక్షేమ పథకాలు అందజేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. టెక్కలి నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటు, సముద్ర తీరం గుండా రోడ్డు వేస్తామని చెప్పిన కూటమి నాయకులు కనీసం ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. చంద్రబాబు మోసాలను పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలి.

–దుంపల లక్ష్మణరావు,
వైఎస్సార్‌సీపీ కాళింగ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు

సూపర్ సిక్స్ పెద్ద మోసం



సూపర్‌సిక్స్ పెద్ద మోసం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. ఈ విషయాన్ని వైస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసి ప్రతీ పేద, సామాన్య వర్గాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కార్యకర్తలు ఇప్పటి నుంచే పని చేయాలి.

–నర్తు రామారావు, స్థానికసంస్థల ఎమ్మెల్సీ

రౌడీ షీటర్లతో మంత్రి అచ్చెన్న పాలన



ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తుంటే.. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు రౌడీ షీటర్లతో పాలన కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం వరకు పేద, సామాన్య వర్గాల ఆర్థిక జీవన ప్రమాణాలు ఎంతో మెరుగ్గా ఉండేవని గుర్తు చేశారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజల ఆర్థిక వ్యవస్థ నాశనమైంది. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు సోదరులు హరిప్రసాద్, ప్రభాకర్‌లు కొంత మంది అధికారులను అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతూ ప్రజా ధనం దోపిడీ చేస్తున్నారు. మూలపేట పోర్టు చంద్రబాబు తీసుకువచ్చారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పడం పెద్ద జోక్. గత ప్రభుత్వంలో ఎంత మేరకు పోర్టు పనులు జరిగాయో.. కూటమి ప్రభుత్వంలో ఎంత మేరకు జరిగాయో దమ్ముంటే అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు బహిరంగ చర్చకు రావాలి. టెక్కలి నియోజకవర్గంలో సీఐలు, ఎస్సైలతో పాటు ఆర్డీవో సైతం మంత్రి తన సొంత సామాజికవర్గానికి చెందిన వారిని నియమించుకుని పాలన మొత్తం దోపిడీ చేస్తున్నారు. అబద్ధాన్ని వేగంగా ప్రచారం చేసే వారు కింజరాపు కుటుంబీకులు. చంద్రబాబు చేసిన మోసాలతో పాటు మంత్రి చేస్తున్న అరాచకాలను ప్రతీ గడపకూ వెళ్లి వివరిస్తాం.

–పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి

మహిళలే అధికంగా మోసపోయారు



ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా చంద్రబాబు చేస్తున్న మోసాల్లో అత్యధికంగా మహిళలే మోసపోయారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ సంక్షేమ పథకానికి మహిళలను యజమానిగా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు సరికదా.. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలపై అఘాయిత్యాలు, దారుణాలు జరుగుతున్నాయి. ఇటువంటి మోసపూరితమైన ప్రభుత్వానికి మహిళా లోకం తగిన గుణపాఠం చెప్పాలి.

–దువ్వాడ వాణి,
జెడ్పీటీసీ సభ్యురాలు, టెక్కలి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన విశ్రాంత ఈవోపీఆర్డీ

టెక్కలి: టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సార్లిగాం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు, విశ్రాంత ఈవోపీఆర్డీ బొడ్డేపల్లి రామారావు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టెక్కలిలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ విస్తృతస్థాయి సమావేశంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ముఖ్య నాయకులు కుంభా రవిబాబు, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, దుంపల లక్ష్మణరావు టెక్కలి జెడ్పీటీసీ సభ్యుడు దువ్వాడ వాణి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఈఈ యజ్ఞేశ్వరరావు

కాశీబుగ్గ: పలాసలోని జీడి పరిశ్రమలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక విద్యుత్ కార్యాలయ ఈఈ యజ్ఞేశ్వరరావు అన్నారు. జీడి పారిశ్రామికవాడలో శనివారం పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాత్కాలిక సమస్యలను పరిష్కరించడంతో విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం ఉండదని అన్నారు. సమావేశంలో జీడి పరిశ్రమదారుల సంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరం, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్, సభ్యులు తాళాసు శ్రీను, టంకాల నాగభూషణ, డోకి వెంకటరమణ, శాశనపురి పాండు రంగారావు, నవీన్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పండాతోటలో ఇటీవల నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హరిముకుందపండా ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, అల్పాహారం సమకూర్చారు.

పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం: మున్సిపల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పురమిత్ర యాప్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. వీధుల్లో పారిశుద్ధ్యం, కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడం వంటి సమస్యలు ఉంటే వాటికి సంబంధించిన ఫొటోలను పురమిత్ర యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తే సంబంధిత అధికారి 24 గంటల్లోపు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. సమస్య పెద్దదైతే మూడు నుంచి నాలుగు రోజుల్లో పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. యాప్‌ని స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రోడ్లపైనే పశువులు తిష్ఠ!



రోడ్డు మధ్యలో తిష్ఠ వేసిన పశువులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో రోడ్లపైనే పశువులు తిష్ఠ వేస్తున్నాయి. ప్రధానంగా ఆవుల యజమానులు యథేచ్ఛగా రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో రోడ్ల మధ్యలో పశువులు ఉంటుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి రోడ్లపై ఆవులు సంచారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

సీడ్ ప్లాట్‌తో రైతులకు ప్రయోజనం



కుమ్మరిపేటలో సీడ్ ప్లాట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచిలి: సేంద్రీయ వ్యవసాయ విధానంలో సీడ్ ప్లాట్ వలన రైతులకు మంచి ప్రయోజనాలుంటాయని ఐసీఆర్పీ విజయలక్ష్మి, మీనలు వివరించారు. బొగాబెణి పంచాయతీ పరిధి కుమ్మరిపేట గ్రామంలో కుమ్మరి హరిచంద్రకు చెందిన 50 సెంట్లు జీడితోట, చిన్నకొజ్జిరియా గ్రామంలో రైతులు గొనప పద్మనాభం, గొనప పురుషోత్తంలకు చెందిన ఎకరా జీడితోటలో వరుసల పద్ధతిలో నవధాన్యాలు ఆర్డీఎస్ విత్తనాల కోసం 11 రకాల విత్తనాలు వేయించారు. ఈ పద్ధతిపై కలిగే ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా చూపించి వివరించారు. అవగాహన కార్యక్రమంలో ఐసీఆర్పీలు భవానీ, నాగమణి, రైతులు హాజరయ్యారు.

గుట్టుగా గోమాంసం రవాణా



బూరగాం గ్రామం వద్ద బోల్తా పడిన గోమాంసం తరలిస్తున్న వ్యాన్



వ్యాన్‌లో రవాణా చేస్తున్న గో మాంసం

కంచిలి: జాతీయ రహదారి మీదుగా ఒడిశా నుంచి ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రాంతాలకు పెద్ద ఎత్తున గో మాంసం రవాణా జరుగుతోంది. తాజాగా శనివారం కంచిలి మండలం బూరగాం గ్రామం వద్ద ఓ వ్యాన్ టైర్ పంక్చర్ కావడంతో బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి వ్యాన్‌ను పక్కకు తీసేసరికి ఆ వ్యాన్‌లో పైన లోడ్‌లో బంగాళా దుంపల బస్తాలు, కింద భాగంలో గో మాంసం నిల్వలు కనిపించాయి. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి, బోల్తా పడిన వ్యాన్‌ను క్రేన్ సాయంతో సరిచేసి, కంచిలి పోలీస్ స్టేషన్‌కు వ్యాన్‌లో ఉన్న సరకుతో సహా తరలించారు.

ఒడిశా నుంచి రాజమండ్రికి రవాణా

ఈ వ్యాన్ ఒడిశా రాష్ట్ర పరిధి పిపిలి అనే గ్రామం నుంచి రాజమండ్రికి గో మాంసాన్ని తరలిస్తున్నట్లు వ్యాన్ సిబ్బంది నుంచి సమాచారం తెలిసింది. పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈ వ్యాన్ ఒడిషా రాష్ట్ర పరిధి రంభ ఘాటి నుంచి బయలుదేరి రాజమండ్రి వెళుతుండగా మార్గం మధ్యలో ప్రమాదం జరిగి, విషయం బయట పడిందని స్థానిక ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు. ఈ వ్యాన్‌లో వెయ్యి కిలోలు అంటే ఒక టన్ను గో మాంసం రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై స్థానిక ఎస్‌ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గో మాంసాన్ని పాతిపెట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యాయవాది మృతికి సంతాపం

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఖజానా వెంకట్రావు శనివారం మృతి చెందారు. పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా న్యాయవాదిగా సేవలు అందజేసిన వెంకట్రావు మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు డి.వి.వివేకానంద, బి.గౌరీపతి, పి.వైకుంఠరావు, పి.బాబురావు, ఎస్.రమణారావు, పి.ఆనంద్, బి.కృష్ణారావు, పి.బాలకృష్ణ, డి.ధర్మారావు, ఎస్.రాజన్నాయుడు, చంద్రశేఖర్ పట్నాయక్, ఎ.వైకుంఠరావు, ఎస్.దివాకర్, పి.చంద్రుడు, పి.సాయిరాజు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా నాబార్డ్ దినోత్సవం




మాట్లాడుతున్న నూక సన్యాసిరావు

బూర్జ: మండలంలోని పెద్దపేట అర్చ్ సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ నూక సన్యాసిరావు ఆధ్వర్యంలో నాబార్డ్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి నాబార్డ్ అండగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటీర, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు సహాయం అందిస్తుందన్నారు. నాబార్డ్ సహకారంతో అర్చ్ సంస్థ ఆధ్వర్యంలో 1998 నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలకు శిక్షణ కార్యక్రమాలు, వాటర్ షెడ్ ద్వారా సహజ వనరుల అభివృద్ధి, మాతోట ద్వారా 1000 ఎకరాల్లో 1,030 మంది రైతులతో జీడి, ఉసిరి, అంతర పంటలు వేసి అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో రోడ్లు, భవనాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సంస్థ ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ నూక అనూప్, మన్యం సహజ సీఈఓ బి.శంకరరావు, అర్చ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో మేలు

హిరమండలం: నవ ధాన్యాల సాగుతో అనేక లాభాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని భగీరథిపురం గ్రామంలో నవ ధాన్యాల సాగులో పంటకోత ప్రయోగాన్ని శనివారం నిర్వహించినట్లు చెప్పారు. 30 రకాల 25 కిలోల విత్తనాలు వేసిన పొలంలో జీలుగు, కట్టిజనుము, పిల్లిపెసర, మినుము, కంది, ఉలవ, జొన్న, రాగి, బెండ, చిక్కుడు, తోటకూర, గోంగూర బాగా పండాయన్నారు. 5 మీటర్లు పొడవు, వెడల్పు గల విస్తీర్ణంలో వేసిన పచ్చిరొట్ట 50 కిలోలకు పైగా వచ్చిందన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఫణేంద్రకుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడోవార్డు చిన బడం గ్రామానికి చెందిన అట్టాడ ఫణేంద్రకుమార్ పీహెచ్‌డీని అందుకున్నారు. బెంగళూరులోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో ఐఐఎస్‌సీ పూర్తి చేసిన సందర్భంగా ఆయనకు పీహెచ్‌డీ పట్టాను శుక్రవారం అందజేశారు. ప్రస్తుతం బెంగళూరులోని డీఆర్‌డీవోలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ విభాగంలో రీసెర్చ్ సైంటిస్టుగా తాత్కాలిక ప్రాతిపదికన ఫణేంద్రకుమార్ పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ అందుకున్న సందర్భంగా గ్రామస్తులు ఫణేంద్రకుమార్‌ను అభినందించారు.

ఆక్రమణలు అడ్డగింత

నరసన్నపేట: స్థానిక డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు కొందరు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. సత్యవరం రెవెన్యూ పరిధిలో 427/2–బీ సర్వే నంబర్‌లో ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు డంపింగ్ యార్డుకు వెళ్లే కాంక్రీట్ రోడ్డు ఉంది. అక్కడ 11 సెంట్లు వరకు ప్రభుత్వ భూమి ఉంది. విలువైన ఈ భూమిని ఇప్పటికే కొందరు తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు సమాచారం. లక్షల విలువ చేసే ఈ స్థలాన్ని ఆక్రమణదారులు జేసీబీతో చదును చేశారు. సమాచారాన్ని తెలుసుకున్న ఆర్‌ఐ సాయిరాం, సిబ్బంది రికార్డులు పరిశీలించి ఈ స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారించి బోర్డు పెట్టారు.

లక్కవరంలో వరుణ యాగం



సోంపేట మండలం లక్కవరం గ్రామంలోని లోకనాథేశ్వర దేవాలయం ఆవరణలో వరుణయాగాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఇటీవల వర్షాలు కురవక పోవడంతో వరుణయాగాన్ని చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. యాగంలో భాగంగా స్వామివారికి వేదపండితులు మంత్రోచ్ఛరలతో అర్చనలు, అభిషేకాలు, విరాట పర్వం పఠనం, హోమం చేశారు. పరిసర గ్రామాల భక్తులు యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

–సోంపేట

యూత్ అసోసియేషన్ కార్యవర్గం నియామకం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ యూత్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా నియామకమైంది. అధ్యక్షుడుగా బొంపల్లి సునీల్ వర్మ, ఉపాధ్యక్షులుగా జయరాజు, ప్రధాన కార్యదర్శిగా డొక్కరి దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా రాజాం సురేష్, కోశాధికారిగా శ్రీనివాసరావు, 40 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సునీల్‌వర్మను సభ్యులు సత్కరించారు.

కాశీబుగ్గ